సాక్షి కామారెడ్డి

గురువారం । 12 । డిసెంబర్ । 2024



పారదర్శకంగా చేపట్టాలి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం చేపట్టిన సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ విక్టర్ సూచించారు.

- 8లో ▸



సమస్యలు పరిష్కరించాలి

సమస్యల పరిష్కారం కోసం బీడీ కార్మికులు కదం తొక్కారు. బుధవారం జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.6 /13.3

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా

కామారెడ్డి క్రైం: మెడ్‌ప్లస్, చైతన్య ఇండియా ఫిన్ క్రెడిట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలలో పలు రకాల ఉద్యోగాల భర్తీ కోసం శుక్రవారం కలెక్టరేట్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ చదివిన 18 నుంచి 30 ఏళ్లలోపువారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు బయోడేటా, సర్టిఫికెట్లతో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలలోగా కలెక్టరేట్‌కు రావాలని తెలిపారు. ఇతర వివరాలకు 76719 74009, 93923 10323, 62810 99106 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్ష విజయవంతం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ గంజ్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్ష విజయవంతమైందని డీఈవో రాజు తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించిన ప్రతిభా పరీక్షలో విజేతలుగా నిలిచినవారికి బుధవారం జిల్లా స్థాయి పరీక్ష నిర్వహించారు. దీనికి సంబంధించిన ప్రశ్నాపత్రాన్ని డీఈవో ఆవిష్కరించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, జ్ఞాపికలను అందించారు. జిల్లా స్థాయి విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశామని తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో డీసీఈడీ నీల లింగం, ఎంఈవో ఎల్లయ్య, సెక్టోరియల్ అధికారి వేణు శర్మ, టీఎంఎఫ్ నాయకులు వేణు, రామారావు, నరేందర్, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్' విద్యార్థులు ఏబీసీ ఐడీ పొందాలి

కామారెడ్డి అర్బన్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఏబీసీ(అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్) ఐడీ క్రియేట్ చేసుకోవాలని వర్సిటీ కామారెడ్డి స్టడీ సెంటర్ సమన్వయకర్త సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. యూజీసీ నిబంధనలను అనుసరించి 2021, 2022, 2023 సంవత్సరాలలో ప్రవేశాలు పొందిన వారు తప్పనిసరిగా ఏబీసీ ఐడీ పొందాలని సూచించారు. దీనికోసం అడ్మిషన్ నంబర్, మొబైల్ నంబర్, ఆధార్‌కార్డు, పాన్ కార్డు అవసరమౌతాయని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓపెన్ యూనివర్సిటీ వెబ్‌సైట్, స్టడీ సెంటర్ లేదా 82476 97363 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రేపటినుంచి నిజాంసాగర్ నీటి విడుదల



నిజాంసాగర్: యాసంగి పంటల సాగు అవసరాల కోసం శుక్రవారం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేయనున్నట్లు నీటిపారుదలశాఖ ఏఈ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు విడతల్లో 12 టీఎంసీల నీటిని ప్రధాన కాలువ ద్వారా విడుదల చేస్తామని పేర్కొన్నారు. నీటిని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.

తపస్ ధర్మాగ్రహ దీక్ష పోస్టర్ల ఆవిష్కరణ



కామారెడ్డి టౌన్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17న నిర్వహించే ధర్మాగ్రహ దీక్షకు సంబంధించిన పోస్టర్లను బుధవారం సంఘం జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా అధ్యక్షుడు పుల్గం రాఘవరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల పీఆర్‌సీ, నాలుగు డీఏలు, పెండింగ్ బిల్లులు తదితర సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ధర్మాగ్రహ దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీక్షను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రతినిధులు మ్యాక రామచంద్రం, జిల్లా ప్రతినిధులు లక్ష్మీపతి, రాజశేఖర్, తగిలేపల్లి భాస్కర్, దత్తాచారి, రమేష్ గౌడ్, బీఎన్ గిరి, శ్యాం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



రియల్ సంక్షోభం!

- జిల్లాలో ప్లాట్లకు గిరాకీ కరువు
- అమ్ముడుపోని రెడీమేడ్ ఇళ్లు
- ఇతర భూముల అమ్మకాలూ అంతంతే..
- క్రయవిక్రయాలు లేక ఇబ్బందిపడుతున్న వ్యాపారులు

జిల్లాలో రియల్ ఎస్టేట్ దందా సంక్షోభంలో చిక్కుకుంది. ప్లాట్ల క్రయ, విక్రయాలలో జోరు లేకపోవడంతో వ్యాపారులు ఇబ్బందిపడుతున్నారు. నాలుగు డబ్బులు సంపాదించాలన్న ఆశతో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టిన వారంతా వడ్డీలు కట్టలేక విలవిల్లాడుతున్నారు. – సాక్షి, కామారెడ్డి

కామారెడ్డి జిల్లా ఏర్పాటయ్యాక భూముల ధరలు ఆకాశాన్నంటాయి. కామారెడ్డి పట్టణ పరిధిలోని ప్లాట్ల ధరలు ఏకంగా హైదరాబాద్ చుట్టుపక్కల ధరలతో పోటీ పడ్డాయి. రెండుమూడేళ్ల పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు వెంచర్లు, ఆరు ప్లాటు అన్నట్టుగా జోరుగా సాగింది. అయితే కరోనాతో రియల్ దందా ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. కొనుగోళ్లు, అమ్మకాలు పూర్తిగా తగ్గిపోయి వ్యాపారం చతికిలపడిపోయింది. కరోనా వ్యాప్తి తగ్గిన తర్వాత అమ్మకాలు, కొనుగోళ్లలో కొంత కదలిక వచ్చింది. అయితే అప్పటికే అడ్డగోలుగా పెరిగిపోయి ఉన్న ధరలే భారంగా ఉన్న పరిస్థితుల్లో ధరలు మరింత పెరగడంతో ప్లాట్ల కొనుగోలుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా వ్యాపారంలో స్తబ్ధత ఏర్పడింది. ముఖ్యంగా కామారెడ్డి పట్టణంతో పాటు పట్టణ పరిధిలోని ఇల్చిపూర్, అడ్లూర్, దేవునిపల్లి, లింగాపూర్, టేక్రియాల్, సరంపల్లి, పాతరాజంపేట, రామేశ్వర్‌పల్లి తదితర ప్రాంతాల్లో ప్లాట్ల అమ్మకాలు గణనీయంగా తగ్గిపోయాయి. అమ్మకాలు లేకున్నా ప్లాట్ల ధరలు మాత్రం తగ్గడం లేదు. ఇల్లు కట్టుకోవాలనుకుంటున్న వారు మాత్రమే కొనుగోలు చేస్తుండగా, పెట్టుబడి పెట్టాలనుకునే వారు మాత్రం ప్లాట్లు కొనేందుకు ముందుకు రావడం లేదు.

గజానికి రూ. 10 వేలపైనే..

కామారెడ్డి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో భూముల ధరలు భారీగా పెరగడంతో ప్లాటు కొనుక్కోవాలనుకున్న సామాన్యులు బెంబేలెత్తిపోయే పరిస్థితి ఏర్పడింది. పట్టణంలోని పలు కాలనీల్లో ప్లాట్లు కొనాలంటే గజానికి రూ.20 వేల నుంచి రూ. 40 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. సొంత ఇంటి నిర్మాణానికి కనీసం రెండు వందల గజాల ప్లాటు కొనాలంటే రూ.40 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు ఖర్చు చేయాల్సిందే. పెరిగిన ఖర్చులతో కుటుంబాలు నడవడమే కష్టంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్యులు నివాస స్థలం కొనడం సాధ్యం కాని పరిస్థితి ఏర్పడింది. దీంతో చాలా మంది అద్దె ఇళ్లల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. పట్టణానికి దూరంగా వెంచర్లలో కూడా గజానికి తక్కువలో తక్కువ రూ. 10 వేలు పలుకుతోంది. ప్లాటుకోసం కనీసం రూ. 10 లక్షలైనా వెచ్చించాల్సిందే. పట్టణానికి దూరంగా ప్లాటు కొంటే దానికి భవిష్యత్తు ఉంటుందో లేదోనని కొనడానికి చాలా మంది ఆసక్తి చూపడం లేదు. పట్టణంలో పెరిగిన ధరలతో కొందరు సొంతూళ్లలోనే ఇల్లు కట్టుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. అలాగే గతంలో ఊళ్లల్లో వ్యవసాయ భూములు కొనుగోలు చేయడంతో భూముల ధరలు భారీగా పెరిగాయి. తక్కువలో తక్కువ ఎకరానికి రూ.40 లక్షల దాకా పలికాయి. మారుమూల గ్రామాల్లో రూ.30 లక్షలు, పట్టణాలు, మండల కేంద్రాలకు సమీపంలో రూ.40 లక్షలనుంచి రూ.80 లక్షల దాకా పలికాయి. ఇటీవలి కాలంలో కొనుగోళ్లు తగ్గిపోవడంతో ధరలు పడిపోయాయని చెబుతున్నారు. కొనుగోలు చేసిన వారు అమ్ముదామంటే కొనేవారు లేని పరిస్థితి నెలకొందంటున్నారు. కామారెడ్డి పట్టణంలో బిల్డర్లు ఇల్లు కట్టి విక్రయిస్తుంటారు. వాటికీ గిరాకీ లేకపోవడంతో బిల్డర్లు ఇబ్బందిపడుతున్నారు.

అప్పులపాలైన వ్యాపారులు...

ఏడాదిన్నర కాలంగా రియల్ దందాలో స్తబ్ధత కొనసాగుతోంది. రియల్ వ్యాపారం పడిపోవడంతో ప్లాట్లు, భూముల యజమానులతోపాటు వ్యాపారులు, మధ్యవర్తులు కూడా ఇబ్బందిపడే పరిస్థితి ఏర్పడింది. పెరిగిన ధరలు తగ్గే అవకాశాలు లేవు. నష్టానికి ఎవరూ అమ్మే పరిస్థితి లేదు. ప్రస్తుతం ఉన్న ధరలతో అమ్మకాలు సాగడం లేదు. ప్లాట్లు అమ్ముదామని కొందరు ప్రయత్నిస్తున్నా అమ్ముడుపోవడం లేదు. దీంతో పెట్టుబడులకు తెచ్చిన డబ్బులకు వడ్డీ పెరిగిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరైతే కొనుగోలు చేసిన భూములు అమ్ముడుపోయినా అప్పులు తీరే పరిస్థితి లేదని చెబుతున్నారు. ఏళ్ల తరబడిగా అమ్మకాలు లేకపోవడంతో వడ్డీలు రెట్టింపయ్యాయని ఆవేదన చెందుతున్నారు. ఇక మధ్యవర్తిత్వం ద్వారా జీవనం సాగిస్తున్న చాలా మంది దందా నడవక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు. రియల్ ఎస్టేట్ రంగానికి మంచి రోజులు ఎప్పుడు వస్తాయోనని వ్యాపారులు, మధ్యవర్తులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఏ ప్లాటుతో ఏ కిరికిరీనో..

భూముల ధరలతోపాటే వివాదాలూ పెరిగాయి. ఒకే ప్లాటు ఇద్దరు, ముగ్గురు పేర్లపై రిజిస్ట్రేషన్లు అయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఏ ప్లాటు మీద ఎలాంటి కిరికిరీ ఉందో తెలియని పరిస్థితిలో చాలా మంది ఆచితూచి అడుగులు వేస్తున్నారు. దీనికితోడు అసైన్డ్ భూములు, బఫర్ జోన్లు, పాత కాలం నాటి చెరువులు, కుంటల విషయంలో రకరకాల వదంతులు వ్యాప్తి చెందడం, హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో సాగుతున్న కూల్చివేతలు కూడా కొనుగోలుదారుల్లో భయం పుట్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్లాటు కొనడానికి చాలా మంది వెనకాముందవుతున్నారు. ఇది కూడా క్రయ, విక్రయాలపై ప్రభావం చూపిందని అంటున్నారు.

పకడ్బందీగా సర్వే చేయాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల వివరాలను పకడ్బందీగా సేకరించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, టీజీపీఎస్సీ చైర్మన్ బుర్ర వెంకటేశంలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు, గ్రూప్ 2 పరీక్షల నిర్వహణ, నూతన డైట్ మెనూ పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమం, సంక్షేమ హాస్టళ్ల తనిఖీలు తదితర అంశాలపై సమీక్షించారు. ఆయా అంశాలపై పలు సూచనలు ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా అధికారులతో మాట్లాడారు. ఈనెల 14 న జరిగే డైట్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖులను ఆహ్వానించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను కూడా ఆహ్వానించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ సింధు శర్మ, అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ సీఈవో చందర్, డీపీవో శ్రీనివాస్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, ఎస్పీ సింధు శర్మ, జిల్లా అధికారులు

'అభ్యర్థులు నిబంధనలు పాటించాలి'

కామారెడ్డి క్రైం: గ్రూప్–2 అభ్యర్థులు నిబంధనలు పాటిస్తూ పరీక్షకు హాజరు కావాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. పరీక్ష కేంద్రాలలోకి సెల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని పేర్కొన్నారు. ఈనెల 15, 16 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కలెక్టర్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం సెషన్‌లో 8.30 గంటలనుంచి, మధ్యాహ్నం సెషన్‌లో 1.30 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రాలలోనికి అనుమతిస్తామని పేర్కొన్నారు. ఉదయం సెషన్‌లో 9.30 గంటలకు, మధ్యాహ్నం సెషన్‌లో 2.30 గంటలకు పరీక్ష కేంద్రాల గేటు మూసివేస్తామని, ఆ తర్వాత వచ్చేవారిని అనుమతించబోమని తెలిపారు. అభ్యర్థులు ఫొటోతో కూడిన హాల్ టికెట్, ప్రభుత్వం జారీచేసిన ఒరిజినల్ ఫొటోతో కూడిన ఐడెంటిటీ ప్రూఫ్ తీసుకుని పరీక్ష కేంద్రానికి రావాలని సూచించారు. మెహందీ, టాటూ వంటివి పెట్టుకోవద్దని పేర్కొన్నారు. 190 మంది దివ్యాంగ అభ్యర్థులకు కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వింగ్ ఏ, బీ గదులను ఏర్పాటు చేశామని తెలిపారు. అంధులు, పరీక్ష స్వయంగా రాయలేని వారికోసం 23 మంది సహాయకులను నియమించామని వివరించారు.

సర్వేకు సహకరించాలి

కామారెడ్డి క్రైం: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు సర్వేకు సహకరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కోరారు. అధికారులు సర్వేకు వచ్చినప్పుడు దరఖాస్తుదారులు తప్పనిసరిగా ఇంటి వద్ద ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తుదారు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కరెంటు బిల్లు, ఇంటిపన్ను రసీదు, పట్టా పాస్ బుక్కు, భూమి యాజమాన్య పత్రం, పొజిషన్ సర్టిఫికెట్‌లను చూపించాలని సూచించారు.

వ్యవసాయ గణాంకాల నమోదుపై శిక్షణ

కామారెడ్డి క్రైం: వ్యవసాయ గణాంకాల నమోదుపై వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు బుధవారం కలెక్టరేట్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గణాంక శాఖ అధికారులు మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకోసారి వ్యవసాయ గణాంకాలను సేకరిస్తామన్నారు. ఈ ప్రక్రియ మూడు విడతల్లో సాగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే 2021 లో మొదటి విడత పూర్తయ్యిందని, ఇప్పుడు రెండు, మూడు విడతలకు సంబంధించి వివరాలను సేకరించనున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని 118 గ్రామాల్లో ఏఈవోలు పర్యటించి ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలు, దిగుబడులు, సాగునీటి సౌకర్యాల వివరాలు తదితర అంశాలను నమోదు చేస్తారన్నారు. గణాంక శాఖ అధికారి శేఖర్‌రెడ్డి పలు అంశాలపై ఏఈవోలకు అవగాహన కల్పించారు.



హాజరైన వ్యవసాయ శాఖ అధికారులు

'విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత'



పొలంబాటలో పాల్గొన్న విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్, అధికారులు, రైతులు

భిక్కనూరు: రైతుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం జంగంపల్లిలో విద్యుత్‌శాఖ నిర్వహించిన పొలంబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల తమ విద్యుత్ సమస్యలను స్థానిక సిబ్బందికి తెలపాలన్నారు. వారు పట్టించుకోకపోతే 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే వెంటనే సంబంధిత సిబ్బందిపై చర్య తీసుకోవడంతో పాటు సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. విద్యుత్ షాక్‌కు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యుత్ కెపాసిటర్ల బిగింపు వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. కార్యక్రమంలో డీఈ కల్యాణ్ చక్రవర్తి, ఏడీఈ సుదర్శనరెడ్డి, ఏఈ బాలాజీ, రైతులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో వాహనదారుల ఆందోళన

- వాహనాల ప్లగ్‌లు తొలగించారంటూ ఆగ్రహం



ఆర్టీసీ పెట్రోల్ బంక్‌లో ఆందోళన చేస్తున్న వాహనదారులు

భిక్కనూరు: మండల కేంద్రంలోని ఆర్టీసీ పెట్రోల్ బంక్‌లో నిలిపి ఉన్న వాహనాల ప్లగ్‌లను సిబ్బంది తొలగించడంతో వాహనదారులు బుధవారం రాత్రి ఆందోళన చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంతో పాటు చుట్టపక్కల గ్రామాలకు చెందిన పలువురు బుధవారం భిక్కనూరులోని ఆర్టీసీ పెట్రోల్ బంక్ ప్రహరి పక్కన తమ వాహనాలను నిలిపి ఇతర గ్రామాలకు వెళ్లారు. వారు రాత్రి వచ్చేసరికి ఆ వాహనాలకు సంబంధించిన ప్లగ్‌లను తొలగించడంతోపాటు టైర్లలోని గాలి తీసివేశారు. ఇది బంక్ సిబ్బంది పనేనన్న అనుమానంతో వాహనదారులు వారిని నిలదీశారు. స్థానికులు సైతం అక్కడికి వచ్చి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బంక్ సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని, డబ్బుల విషయంలోనూ మోసాలకు పాల్పడుతున్నారని వాహనదారులు ఆరోపించారు. ఆందోళన విషయం తెలుసుకున్న పెట్రోలింగ్ పోలీసులు అక్కడికి వచ్చి వివరాలు తెలుసుకున్నారు. సీసీ ఫుటేజీలను చూపించాలని స్థానికులు పట్టుబట్టారు. ఈ క్రమంలో ప్లగ్‌లు తొలగించింది తానేనని బంక్‌లో పనిచేసే ఒకరు ఒప్పుకున్నారు. దీంతో ప్రజలు అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు అతడిని పక్కకు తీసుకువెళ్లే ప్రయత్నం చేయగా.. స్థానికులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో కానిస్టేబుల్ ఒకరిపై చేయిచేసుకున్నాడు. దీంతో ప్రజలు నిరసన తెలిపారు. బైక్‌ల ప్లగ్‌లు తొలగించిన వ్యక్తిని పోలీసులు తమ వాహనంలో ఎక్కించుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. ఆందోళన చేస్తున్నవారిని పలువురు సముదాయించారు. బంక్ ప్రహరి పక్కన వాహనాలను నిలిపితే అడ్డుకోవద్దని సూచించడంతో ఆర్టీసీ బంక్ సిబ్బంది సరే అన్నారు. దీంతోపాటు తొలగించిన ప్లగ్‌లను వాహనదారులకు అప్పగించారు. దీంతో వాహనదారులు ఆందోళన విరమించారు.

కొనసాగుతున్న 'సమగ్ర' సమ్మె

కామారెడ్డి టౌన్: విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం రెండోరోజు కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 750 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నారు. వీరి సమ్మెతో విద్యావనరుల కేంద్రాలు, భవిత కేంద్రాలకు తాళాలు పడ్డాయి. కేజీబీవీలో విద్యాబోధన ముందుకు సాగడం లేదు. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తమ న్యాయమైన డిమాండ్లను పరిశీలించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కుషాల్, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవులా సమ్మెకు మద్దతు తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, అప్పటి వరకు పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, శ్యాం కుమార్, సంపత్, శ్రీధర్ కుమార్, రాములు, సంతోష్‌రెడ్డి, శిల్ప, లావణ్య, సాయిలు, శైలజ, మాధవి, అజీద్, శ్రీనివాస్, రమేష్, కాళిదాసు, కృష్ణ, శ్రీకాంత్, బన్సీలాల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



సమ్మె శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

రెండు బైక్‌లను ఢీకొన్న కారు

- ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు
- సాలూర క్యాంప్ వద్ద ప్రమాదం

బోధన్ రూరల్ : సాలూర మండలం సాలూర క్యాంప్ గ్రామ సమీపంలో బుధవారం కారు అతివేగంతో రెండు బైక్‌లను ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. బోధన్ పట్టణానికి చెందిన షేక్ దావుద్ కారులో కుటుంబంతో కలిసి మహారాష్ట్రకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సాలూర క్యాంప్ శివారులో బైక్‌పై వెళ్తున్న బోధన్ మండలం భూలక్ష్మి క్యాంప్ గ్రామానికి చెందిన మహేందర్ రెడ్డిని దావూద్ కారు వేగంగా ఢీకొట్టింది. మహేందర్ రెడ్డి కింద పడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. బైక్‌ను ఢీకొట్టిన అనంతరం రాంగ్ రూట్‌లోకి మళ్లిన కారు అదే సమయంలో ఎదురుగా వస్తున్న మహారాష్ట్రలోని దౌలపూర్‌కు చెందిన మహబూబ్, రషీద్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ నడిపిస్తున్న షేక్ మహబూబ్ (42) అక్కడికక్కడే మృతి చెందాడు. వెనక కూర్చున రషీద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షత గాత్రులను చికిత్స నిమిత్తం నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఘటనా స్థలంలో షేక్ మహబూబ్ మృతదేహం

రెవెన్యూ, పోలీసుశాఖల పేరుతో వసూళ్లు

- సుంకెట్ వాగు నుంచి జోరుగా ఇసుక తరలింపు
- వసూళ్లకు పాల్పడుతున్న దళారులు
- ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.500 చొప్పున వసూలు
- ఉచిత ఇసుక విధానానికి గండికొడుతున్న అక్రమార్కులు


సుంకెట్ పెద్దవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

మోర్తాడ్: మోర్తాడ్ మండలం సుంకెట్ పెద్దవాగు నుంచి ఇసుక తరలించే సందర్భంలో దళారులు భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ శాఖ పేరుతో రూ.300, పోలీసు శాఖ పేరుతో రూ.200 చొప్పున మామూళ్లను ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పుకు ఇవ్వాలని వసూళ్లకు తెరలేపారు. దళారులు అధికారుల పేరు చెప్పి ఒక్కో ట్రిప్పుకు రూ.500 చొప్పున వసూలు చేస్తున్నా ఆ రెండు శాఖల అధికారులు మౌనం వహించడం అనుమానాలకు తావిస్తోంది. ఇళ్ల నిర్మాణదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తుండగా, దళారులు అధికారులకు వాటాల పేరిట వసూళ్లకు పాల్పడుతుండటం గమనార్హం. అక్రమార్కుల కారణంగా ఉచిత ఇసుక విధానం మామూళ్ల మయమైంది. సుంకెట్ వాగు నుంచి జిల్లాలో ఎక్కడికైనా ఇసుకను తరలించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఉచిత ఇసుక విధానం అమలులోకి వచ్చినప్పటికీ అధికారులకు వాటాలు అంటూ ప్రతి ట్రిప్పుకు రూ.500 చొప్పున కొందరు దళారులు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇసుక పాయింట్ కొనసాగిన రోజున కనీసం 500 ట్రిప్పుల ఇసుకను తరలిస్తున్నారు. ఆ లెక్కన ఒక్కో రోజు అధికారుల పేరుతో వసూలు చేసే మొత్తం రూ.2.50లక్షలు అని తెలుస్తోంది.

అధికారుల పాత్ర నామమాత్రమేనా?

సుంకెట్ పెద్దవాగు నుంచి గతంలో ప్రతి బుధ, శుక్రవారాల్లో ఇసుకను తరలించేందుకు అనుమతులు ఇచ్చేవారు. కొన్ని నెలలుగా వ్యాపారుల గుప్పిట్లో ఇసుక పాయింట్ ఉండటంతో అధికారుల పాత్ర నామమాత్రమైందనే విమర్శలున్నాయి. తమకు అనుకూలమైన రోజున పాయింట్‌ను నిర్వహించేలా వ్యాపారులు సూచించిస్తుండగా, అధికారులు అదే పాటిస్తున్నారని తెలుస్తోంది.

ఇలా చేస్తే అక్రమాలకు చెక్..

సుంకెట్‌కు చెందిన కొందరు వ్యాపారులే ఇసుకను తరలించేందుకు అధికారుల నుంచి అనుమతి పత్రాలను పొందుతున్నారు. ఇళ్లు నిర్మించుకునే వారు ట్రాక్టర్‌ను తీసుకుని వెళ్తే వారికి ఇసుక తవ్వుకోవడానికి అవకాశం ఇవ్వడం లేదు. అధికారులు పారదర్శకంగా వ్యవహరించి వ్యాపారుల జోక్యాన్ని నివారిస్తే అక్రమ వసూళ్లకు అవకాశం ఉండదనే వాదన వినిపిస్తోంది.

లక్కోర కేంద్రంగా..


లక్కోరకు చేరిన సుంకెట్ పెద్దవాగు నుంచి చిట్టాపూర్‌కు కేటాయించిన ఇసుక ట్రాక్టర్


చిట్టాపూర్ పేరుపై పంపిన ట్రాక్టరు వేబిల్లు

వేల్పూర్: మండలంలోని లక్కోర కేంద్రంగా అక్రమ ఇసుక రవాణా కొనసాగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సుంకెట్ పెద్దవాగు నుంచి ఇతర గ్రామాలకు అనుమతుల పేరిట కేటాయించిన ఇసుకను దారి మళ్లించి లక్కోరలో నిల్వ చేస్తున్నారని అంటున్నారు. పెద్దవాగు వాగు నుంచి తెచ్చిన ఇసుకను లక్కోర వద్ద డంపు చేసి, రాత్రిపూట అమ్ముకుంటున్నారని ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారిపై లక్కోర ఉండడం, రాత్రిపూట ఇతర గ్రామాలకు సులువుగా తరలించడానికి అనువుగా ఉండడంతో వ్యాపారులు తమ అక్రమ ఇసుక దందాను నిరాటంకంగా కొనసాగస్తున్నారని వాపోతున్నారు. మండలంలో వేల్పూర్, వెంకటాపూర్, కోమన్‌పల్లి, కుకునూర్, పచ్చలనడ్కుడ, కొత్తపల్లి ఎస్ గ్రామాలకు పెద్దవాగు సరిహద్దుగా ఉంది. రామన్నపేట్, మోతె, అక్లూర్ గ్రామాల వెంట కప్పల వాగు ప్రవహిస్తుంది. గతంలో ప్రభుత్వం కుకునూర్, కోమన్‌పల్లి, వెంకటాపూర్ గ్రామాల వద్ద ఇసుక తరలింపుకు అనుమతులు ఇచ్చింది. వేల్పూర్ మండలంలో ఇసుక రవాణాకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చి, సామాన్య ప్రజలకు అందుబాటులోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నకిలీ నోట్ల కలకలం

- టాస్క్‌ఫోర్స్ అదుపులో బిచ్కుందకు చెందిన వ్యక్తి

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని వ్యాపార కుటుంబానికి చెందిన ఓ వ్యక్తి మూడు రోజుల క్రితం సుమారు రూ.20లక్షల నుంచి రూ.29లక్షల వరకు నకిలీ నోట్లను కారులో తరలిస్తుండగా బాన్సువాడ సర్కిల్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నట్లు సమాచారం. సదరు వ్యక్తి మూడు రోజులుగా కనిపించడం లేదని, పోలీసులు అదుపులో ఉన్నప్పటికీ ఈ విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నారని మండల కేంద్రవాసులు చర్చించుకుంటున్నారు. నకిలీ నోట్లు ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారా? ముఠాలో ఎవరెవరు ఉన్నారనే వివరాలను పోలీసులు సేకరిస్తున్నట్లు తెలిసింది. దీంతో సదరు వ్యక్తితో పరిచయం ఉన్న వారు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు తమను విచారిస్తారనే భయంతో కొందరు బిచ్కుంద నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. నకిలీ నోట్ల చలామణికి సంబంధించి వివరాలు త్వరలోనే బయటకు వచ్చే అవకాశాలున్నాయి.

శిక్షణ తరగతుల్లో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



నిజాంసాగర్(జుక్కల్): హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల విభాగంలో రెండు రోజుల పాటు జరుగుతున్న శాసన సభ, శాసన మండలి సభ్యుల శిక్షణ తరగతుల్లో బుధవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. సహచర శాసన సభ్యులు, ఎమ్మెల్సీలతో కలిసి శిక్షణ తరగతులకు ఎమ్మెల్యే హాజరయ్యారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ప్రతిభా పరీక్షకు విద్యార్థుల ఎంపిక



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి గణిత ప్రతిభా పరీక్షకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ గాంధీ బుధవారం తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పరీక్షలో పాఠశాలకు చెందిన విద్యార్థులు అంజలి, మణిదీప్‌లు జిల్లా స్థాయిలో గురుకుల పాఠశాల విభాగంలో ప్రథమ, తృతీయ స్థానాలను సాధించారన్నారు. వీరు రాష్ట్ర స్థాయి పరీక్షకు ఎంపికయ్యారని అన్నారు.

ప్రతిభ కనబర్చిన పిట్లం విద్యార్థినులు



పిట్లం(జుక్కల్): కామారెడ్డి జిల్లా కేంద్రంలో తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో పిట్లం మండలం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల(చిల్లర్గి)కు చెందిన విద్యార్థిని డి.పూజ ద్వితీయ స్థానం, పిట్లం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని జీ. స్వరలక్ష్మి తృతీయ స్థానం సాధించి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందుకున్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాచారెడ్డి: అంగన్ వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వెల్ఫేర్ అధికారి చందర్ రాథోడ్ సూచించారు. బుధవారం పాల్వంచ మండల కేంద్రంలోని అంగన్‌వాడి కేంద్రంలో పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ అనసూయ, అంగన్ వాడి టీచర్లు ఉన్నారు.

ఘనంగా భారతీయ భాషాదినోత్సవం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): కృష్ణాజివాడిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం భారతీయ భాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు 15 భాషలు, ఆయా రాష్ట్రాలకు సంబంధించిన నృత్యకళలను ప్రదర్శించారు. అలాగే ఆయా అంశాలపై విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. హెచ్ఎం నివేదిత, ఉపాధ్యాయులు గంగాధర్, గిర్మబోయి, శ్వేత, సుజాత, రమేష్, హేమంత్, సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా చేపట్టాలి

అదనపు కలెక్టర్ వి.విక్టర్


సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

రామారెడ్డి: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్ అన్నారు. బుధవారం రామారెడ్డి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును ఆయన పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సువర్ణ, ఎంపీడీవో తిరుపతిరెడ్డి ఉన్నారు.

టీపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికను రద్దు చేయాలి

కామారెడ్డి టౌన్: నిబంధనలకు విరుద్ధంగా జరిగిన తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికను తక్షణమే రద్దు చేయాలని జిల్లా ఉపాధ్యక్షులు కె.నళిని, శ్రీనివాస్, కార్యదర్శులు నరేంద్ర ప్రసాద్, రూప్‌సింగ్, జిల్లా మాజీ అధ్యక్షుడు సత్యనారాయణలు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సమావేశం నిర్వహణ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని, ఈ ఎన్నికను గుర్తించడం లేదని వారు పేర్కొన్నారు.రాష్ట్ర అధ్యక్షుడి సమక్షంలో సమావేశం జరపడం శోచనీయమన్నారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్న బీడీ కార్మికులు

కామారెడ్డి టౌన్: బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం, శ్రామిక శక్తి తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్, ఏఐఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో బీడీ కార్మికులతో కలిసి బుధవారం జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. ఈ ధర్నానుద్దేశించి బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ మాట్లాడుతూ.. బీడీ కార్మికులకు 2014 సంవత్సరం కటాఫ్ తేదీని తొలగించాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రూ.4016 జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. నేతలు సిద్దిరాములు, నాగారపు యెల్లయ్య, ఆంజనేయులు, అనుసూయ, కుర్తి లింగం, వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో ఎయిడ్స్, సుఖ వ్యాధులపై బుధవారం ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది అవగాహన కల్పించారు. పట్టణంలో పలు చోట్ల రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో వాహనం ద్వారా వీడియో ప్రదర్శనలు వేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధి అంటువ్యాధి కాదని అన్నారు.వ్యాధి సోకినవారు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. సిబ్బంది గోపాల్ పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి


మద్దతుగా దీక్షలో కూర్చున్న ఎస్టీయూ నేతలు

కామారెడ్డి అర్బన్: సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె న్యాయసమ్మతమైందని, 20 ఏళ్లుగా చాలీ చాలని వేతనాలతో జీవితాలు వెళ్లదీస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేసి భద్రత కల్పించాలని స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు ఎస్టీయూ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని, ఆంధ్రప్రదేశ్, హర్యానా, బీహార్, పశ్చిమ బెంగాల్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగులకు అమలు చేస్తున్న వేతనాలకు సమానంగా తెలంగాణలో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపల్ వద్ద చేస్తున్న దీక్ష శిబిరాన్ని బుధవారం సందర్శించి మద్దతు తెలిపారు. యూనియన్ ఆర్థిక కార్యదర్శి సయ్యద్ ఖలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట విద్యా వనరుల కేంద్రానికి తాళం


మూసి ఉన్న లింగంపేట విద్యా వనరుల కేంద్రం

లింగంపేట(ఎల్లారెడ్డి): సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరవధిక సమ్మెకు దిగడంతో బుధవారం తాళం వేసి ఉంది. సమ్మెలో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు సీఆర్పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్, మెస్సెంజర్, పీటీఐలు, పీఈటీలు, ఐఈ ఆర్‌పీలతో పాటు కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలకు చెందిన సిబ్బంది విధులకు హాజరు కాలేదు.

నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్): సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేస్తుండటంతో బుధవారం మండల విద్యాశాఖ కార్యాలయం మూతపడింది. ఎంఈవో తిరుపతి రెడ్డి ప్రభుత్వ పాఠశాలలు, మధ్యాహ్న భోజనం తనిఖీకి వెళ్లారు. దాంతో విద్యాశాఖ కార్యాలయం తాళాలు తెరుచుకోలేదు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు మృతి

మురికి కాలువలో పడి ..

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోటగల్లీకి చెందిన శ్రీరామ లక్ష్మణ్(50) అనే వ్యక్తి మురికి కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రతిరోజూ మద్యం తాగే అలవాటు ఉన్న లక్ష్మణ్ కొన్ని సందర్భాల్లో ఇంటికి వెళ్లేవాడు కాదన్నారు. బుధవారం ఉదయం నగరంలోని చంద్రానగర్ కాలనీ శ్మశాన వాటిక వద్ద మురికికాలువలో పడి మృతి చెందినట్లు తెలిపారు. మద్యం సేవించి భార్యను ఇబ్బందులకు గురి చేయడంతో భార్య 25 ఏళ్ల క్రితం లక్ష్మణ్‌ను వదిలి వెళ్లిపోయిందని, అప్పటి నుంచి తల్లివద్దే ఉంటున్నాడన్నారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సౌదీలో కామారెడ్డి వాసి ..


అబ్దుల్ సలీం

కామారెడ్డి క్రైం: పట్టణంలోని సైలానీబాబా కాలనీకి చెందిన అబ్దుల్ సలీం (41) గుండెపోటుతో సౌదీలో మృతి చెందినట్లు స్థానికులు బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆర్థిక ఇబ్బందులకు తోడు ఉపాధి లేకపోవడంతో బతుకుదెరువు కోసం ఈ నెల 6న సలీం సౌదీ అరేబియాలోని జెద్దాకు వెళ్లాడు. సోమవారం డ్యూటీ నుంచి రూమ్‌కు వెళ్ళిన తర్వాత గుండెపోటు రావడంతో అక్కడి వారు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే సలీం మృతి చెందినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని కామారెడ్డికి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు మృతుని బంధువులు తెలిపారు.

గోదావరిలో దూకి ఆత్మహత్య

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని గోదావరి పుష్కర ఘాట్ సమీపంలోని నదిలో జిల్లా కేంద్రానికి చెందిన ఉల్లెందుల రాజు(40) దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెండోరా ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. రాజు గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని, మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళ అదృశ్యం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై రజినీకాంత్ తెలిపారు. పనికి వెళ్తున్నాను అని చెప్పి గత నెల 29న ఇంట్లో నుంచి వెళ్లిన మహిళ తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారన్నారు. ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సైబర్ మోసం

ఎడపల్లి(బోధన్):మండలంలోని ఠాణాకలాన్‌కు చెందిన ఓ యువకుడు క్రెడిట్‌కార్డు డీఆక్టివేట్ చేసేందుకు ఓ లింక్‌ను ఓపెన్ చేసి రూ.28వేలు మోసపోయాడని ఎస్సై వంశీచందర్ రెడ్డి తెలిపారు. బాధిత యువకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. సైబర్ నేరగాళ్లు పంపించే ఎలాంటి లింక్‌లు ఓపెన్ చేయొద్దని, బ్యాంక్ వ్యవహారాలు ఉంటే సంబంధిత బ్యాంక్‌కు వెళ్లాలని మండల ప్రజలకు సూచించారు.

ఆర్మూర్‌లో దొంగల హల్‌చల్


చోరీ జరిగిన ధోండి మెడికల్


సీసీ ఫుటేజీలో రికార్డు అయిన దుండగుల కదలికలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో బుధవారం తెల్లవారుజామున మూడు దుకాణాల్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని మహాలక్ష్మి కాలనీలో ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో పోలీస్ పెట్రోలింగ్ వాహనం వెళ్లగానే టాటా ఏస్‌లో వచ్చిన ఐదుగురు దుండగులు ధోండిడి మెడికల్ షట్టర్‌ను ధ్వంసం చేసి రూ.3లక్షల నగదు, అలాగే కేర్ మెడికల్‌లో నుంచి రూ.30వేలు, సమీపంలోని ఓ స్కానింగ్ సెంటర్ నుంచి సుమారు రూ.30వేల నగదు, టీవీని ఎత్తుకెళ్లారు. దుండగుల కదలికలు సీసీ ఫుటేజీలో పరిశీలించామని, వారు వాడిన వాహనం మహారాష్ట్రలో రిజిస్ట్రేషన్ అయ్యిందని పోలీసులు తెలిపారు. దొంగలు అక్కడివారే కావొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. దుకాణాలను ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, క్లూస్ టీం బృందం పరిశీలించి ఆధారాలు సేకరించారు. రెండు పోలీసు బృందాలు దర్యాప్తు ప్రారంభించాయని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

పెళ్లికి వెళ్లి వచ్చేసరికి..

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన కట్ట మానస, ఆమె భర్త రాజశేఖర్ తమ బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగివచ్చే సరికి దుండగులు ఇంట్లో చొరబడ్డారు. రాజశేఖర్ వారిని పట్టుకునేందుకు ప్రయత్నించినప్పటికీ చిక్కలేదు. ముప్కాల్ ఎస్సై రజినీకాంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మానసతోపాటు ఆమె భర్త రాజశేఖర్ బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లి మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంటకు తిరిగి వచ్చారు. అప్పటికే ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో మానస అనుమానంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా ముగ్గురు దుండగులు కనిపించారు. ఆమె కేకలు వేయడంతో అప్రమత్తమైన రాజశేఖర్ వారిని పట్టుకునేందుకు ప్రయత్నించినప్పటికీ వారు పరారయ్యారు. దండుగులు తమ ఇంట్లో నుంచి రూ.లక్షా పది వేల నగదుతోపాటు రెండు బంగారం ఉంగరాలు ఎత్తుకెళ్లారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



నవీపేట: మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ ఎదుట చోటుచేసుకున్న ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు పెద్ద సాయిలు(61) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. కళ్యాపూర్ గ్రామానికి చెందిన గుట్టమీది పెద్ద సాయిలు ఈనెల 5న నవీపేట నుంచి కళ్యాపూర్ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి బస్సును ఢీకొట్టాడన్నారు. గాయాలపాలైన సాయిలును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. మృతుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వ్యక్తికి న్యాయస్థానం మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ బుధవారం తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చిన తరువాత సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచామన్నారు. మెజిస్ట్రేట్ నూర్ జహాన్ బేగం 30 మందికి రూ.59,200 జరిమానా విధించారని అలాగే ఆర్మూర్‌కు చెందిన కోయల్కర్ శ్రీనివాస్‌కు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు వివరించారు.

అక్బర్‌నగర్‌కు చెందిన వ్యక్తికి..

రుద్రూర్: మండలంలోని అక్బర్ నగర్ గ్రామానికి చెందిన వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడని ఎస్సై సాయన్న తెలిపారు. సదరు వ్యక్తిని బోధన్ కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం రెండు రోజుల జైలుశిక్ష విధించిందన్నారు.

రౌడీషీటర్ల బైండోవర్

రుద్రూర్: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండలానికి చెందిన ఇద్దరు రౌడీ షీటర్లను బుధవారం బైండోవర్ చేసినట్టు ఎస్సై సాయన్న తెలిపారు. మండల కేంద్రానికి చెందిన సాయిలు, గంగాసాగర్‌ను సత్ప్రవర్తనలతో మెలగాలని ముందు జాగ్రత్త చర్యగా తహసీల్దార్‌ఎదుట బైండోవర్ చేశామని పేర్కొన్నారు.

బోధన్‌లో అల్ప్రాజోలం పట్టివేత

- 4.330 కిలోల నిషేధిత మత్తు పదార్థం స్వాధీనం
- పట్టుబడిన అల్ప్రాజోలం విలువ రూ.43 లక్షలు


వివరాలు వెల్లడిస్తున్న స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు

బోధన్‌టౌన్(బోధన్):మహారాష్ట్రలోని నాందెడ్ జిల్లా హైమద్‌నగర్ నుంచి బాన్సువాడ – వర్ని మీదుగా మారుతి సుజికి వాహనంలో తరలిస్తున్న 4 కిలోల 330 గ్రాములు అల్ప్రాజోలంను స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. నిందితులను విచారించి బోధన్‌లోని ఎక్సైజ్ సీఐ కార్యాలయానికి తరలించారు.అనంతరం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ రాష్ట్ర సూపరింటెండెంట్ ప్రదీప్‌రావ్ మాట్లాడుతూ..రాష్ట్రంలో మత్తు పదార్థాల నిర్మూలనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ఇందులో భాగంగానే రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మహారాష్ట్రలోని నాందెడ్ జిల్లా హైమద్‌నగర్ నుంచి సిద్దిపేట్ ప్రాంతానికి చెందిన నర్సింలుగౌడ్, నవీన్‌గౌడ్, నాందెడ్‌కు చెందిన యాదగిరి బాన్సువాడ–వర్ని మీదుగా పెద్ద మొత్తంలో అల్ప్రాజోలం తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు రెండు బృందాలుగా ఏర్పడి పట్టుకున్నామన్నారు.పట్టుబడిన అల్ప్రాజోలం విలువ సుమారు రూ.43 లక్షలు ఉంటుందని తెలిపారు. మరో బృందం ఇప్పటికీ తనిఖీలు చేపడుతోందని వెల్లడించారు. సమావేశంలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ శ్రీనివాస్‌రావు, ఇన్‌స్పెక్టర్లు స్వప్న, వెంకటేశ్వర్లు, సీఐ పవన్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని నేరల్‌తండాలో ఎండు గంజాయి విక్రయిస్తున్న మహిళతో పాటు మరో యువకుడిని అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నేరల్‌తండాకు చెందిన బామన్ సజ్జు అనే మహిళ తన ఇంట్లోనే ఎండు గంజాయిని చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తోందనే పక్కా సమాచారం మేరకు రెక్కీ నిర్వహించి పట్టుకున్నామన్నారు. ఆమె ఇంట్లో తనిఖీ చేయగా 105 గ్రాముల ఎండు గంజాయి లభించినట్లు తెలిపారు. సదరు మహిళ ఇంటి పరిసరాల్లో గంజాయి మొక్కలు పెంచిందని, చెట్లు ఎవరికీ కనిపించకుండా చుట్టూ కట్టెలు పెట్టి ఉంచిందన్నారు. గంజాయి ఎండిన అనంతరం చిన్నచిన్న ప్యాకెట్లలో నింపి బన్సీ ప్రకాశ్ అనే వ్యక్తి ద్వారా అధిక ధరకు విక్రయిస్తోందని తెలిపారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

10 వేల మంది అయ్యప్పస్వాముల గిరి ప్రదక్షిణ

ఆలయ చరిత్రలోనే మొదటిసారి


యాదగిరి కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ చేస్తున్న అయ్యప్ప స్వాములు

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో బుధవారం అయ్యప్ప మాలధారణ స్వాముల సందడి నెలకొంది. ఏకాదశి, గీత జయంతిని పురస్కరించుకొని స్థానిక అయ్యప్ప స్వాములతో పాటు తెలంగాణ నలుమూలలు, వివిధ రాష్ట్రాలకు చెందిన 10 వేల మందికి పైగా మాలధారణ స్వాములు శ్రీస్వామి వారి కొండ చుట్టూ గిరిప్రదక్షిణ చేపట్టారు. అయ్యప్ప మాలధారణ స్వాములు ఇంత పెద్దఎత్తున గిరి ప్రదక్షిణ చేయడం ఆలయ చరిత్రలో ఇదే మొదటిసారి. మంగళవారం రాత్రి నుంచే పలు జిల్లాలు, రాష్ట్రాల నుంచి అయ్యప్ప మాలధారణ స్వాములు యాదగిరిగుట్టకు చేరుకున్నారు. వేకువ జామునే వైకుంఠద్వారం వద్దకు అయ్యప్పలు భారీగా చేరుకొని శ్రీలక్ష్మీనరసింహస్వామికి, పల్లకిలో అధిష్ఠించిన అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఈట భాస్కర్‌రావు ప్రత్యేక పూజలు చేసి, గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. గిరి ప్రదక్షిణ మార్గమంతా అయ్యప్ప మాలధారణ స్వాములతో నిండిపోయింది. నారసింహుడు, అయ్యప్ప నామ స్మరణలతో అధ్యాత్మికతను సంతరించుకొంది. గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న మాలధారణ స్వాములంతా మెట్ల మార్గంలో కొండపైకి చేరుకున్న తర్వాత.. రూ.150 వీఐపీ దర్శనం మార్గంలో ప్రధానాలయంలోకి వెళ్లి గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకున్నారు. గిరి ప్రదక్షిణలో పాల్గొని, శ్రీస్వామిని దర్శించుకున్న మాలధారణ స్వాములకు భాస్కర్‌రావు ప్రత్యేక ప్రసాదాన్ని అందజేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయ పరిసరాల్లో ఎటు చూసినా అయ్యప్ప మాలధారణ స్వాములే కనిపించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాగ్రహం వల్లే డైవర్షన్ పాలిటిక్స్

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మండిపాటు

- చంద్రబాబు అబద్ధాలు మోసాలుగా మారాయి
- అవే ప్రజల్లో కోపంగా మారుతున్నాయి
- మా పథకాలెందుకు ఇవ్వట్లేదని ప్రజలు నిలదీస్తున్నారు
- ప్రజలకు సమాధానం చెప్పలేకే ప్రతి నెలా ఏదో ఒక అంశంపై గోబెల్స్ ప్రచారం

సాక్షి, అమరావతి: 'ప్రజలకు అబద్ధాలు చెబితే అది మోసం అవుతుంది. అది ప్రజల్లో కోపం కింద మారుతుంది. ఆ కోపమే చంద్రబాబు పాలనపై ప్రజల్లో ఇప్పుడు విపరీతంగా కనిపిస్తోంది' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. సూపర్ సిక్స్ సహా ఎన్నికల హామీల అమలు ఏమైందని ప్రజలు నిలదీస్తుండటంతో సమాధానం చెప్పలేని టీడీపీ పెద్దలు డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని దెప్పి పొడిచారు. 'జూన్‌లో రుషికొండ భవనాలు అని, జూలైలో శ్వేతపత్రాలు అని, మదనపల్లె ఫైల్స్ అని, ఆగస్టులో ముంబై నటి కాదంబరి జెత్వానీ అని, సెప్టెంబర్‌లో ప్రకాశం బ్యారేజీని బోట్లతో ఢీకొట్టి కూలగొట్టాలన్న కుట్ర చేశామని, అక్టోబర్‌లో నా కుటుంబాన్ని తెచ్చి, నవంబర్‌లో బడ్జెట్‌పై దృష్టి మరలించడానికి రూ.14 లక్షల కోట్లు అప్పు అని డైవర్షన్ చేశారు. ఇప్పుడు డిసెంబర్‌లో రేషన్ బియ్యం అక్రమ రవాణా అంటూ నానా హంగామా చేస్తూ, దుష్ప్రచారం చేస్తున్నారు'అని ఎత్తి చూపారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన ఉమ్మడి ప్రకాశం జిల్లా పార్టీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నేతలతో సమావేశమై.. భవిష్యత్ కార్యాచరణపై వారికి దిశా నిర్దేశం చేశారు. నిత్యం ప్రజలతో మమేకమవుతూ.. వారి పక్షాన ప్రభుత్వంపై పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. 'యుద్ధం గతంలోలా లేదు. మనం చంద్రబాబుతోనే యుద్ధం చేయడం లేదు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, ఎల్లో మీడియాతోనూ పోరాటం చేస్తున్నాం. వీటికి తోడు చెడిపోయిన ఐ-టీడీపీతో యుద్ధం చేస్తున్నాం. వీరంతా నిత్యం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. వీళ్లు ప్రజలకు చేసిన మంచి చెప్పుకోవడానికి ఏమీ లేదు. బురద జల్లడమే పనిగా పెట్టుకున్న వారితో మనం యుద్ధం చేస్తున్నాం. అబద్ధాలు చెప్పడం, వక్రీకరణ చేయడం, దుష్ప్రచారం చేయడాన్ని ఒక పనిగా పెట్టుకున్నారు. దీన్ని తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది'అని నేతలకు ఉద్బోధించారు. 'ప్రతి ఒక్కరికీ సోషల్ మీడియా ఎక్కౌంట్ ఉండాలి. అన్యాయం జరిగితే దాన్ని కచ్చితంగా ప్రశ్నించాలి. ఎక్కడ అన్యాయం జరిగినా ఫోటో తీసి ప్రశ్నించాలి. ఎందుకు అమ్మఒడి రావడం లేదు? మా విలేజ్ క్లినిక్ పరిస్థితి ఎందుకు ఇంత దారుణంగా ఉంది? ఇలా అన్ని సమస్యలపై ఫోటోలు తీసి అప్ లోడ్ చేయాలి. తద్వారా ప్రజలకు దగ్గర కావాలి'అంటూ నేతలకు దిశా నిర్దేశం చేశారు. 'ఎన్నికలు అయిపోయి ఆరు నెలలు దాటింది. ఈ పరిస్థితుల్లో పార్టీని మనం మళ్లీ సమాయత్తం చేసే దిశగా అడుగులు వేస్తూ ఇవాళ కలుస్తున్నాం. ఆరు నెలల్లో ఇంత వ్యతిరేకత ఈ స్థాయిలో ఏ ప్రభుత్వం మీద లేదు. కేవలం చంద్రబాబునాయుడు పాలనలో మాత్రమే ఇలాంటి పరిస్థితి చూస్తున్నాం'అన్నారు. ఈ సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

చంద్రబాబు బాదుడే బాదుడు

ఈ డైవర్షన్ పాలిటిక్స్ మధ్య ఈరోజు మనం పార్టీ బలోపేతం చేయడంతో పాటు, ప్రజల తరపున పోరాటం చేయడానికి సన్నద్ధం అయ్యాం. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలన్నీ నాశనమయ్యాయి. మరో వైపు బాదుడే బాదుడు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ లేవు. వ్యవస్థలన్నీ పూర్తిగా దిగజారిపోయాయి. కరెంటు బిల్లులు ముట్టుకుంటే షాక్ కొడుతున్నాయి. రూ.6 వేల కోట్ల బాదుడుతో మొదటి డోసు ఇది. నవంబరు, డిసెంబరు బిల్లులో ఏ ఇంటికి వెళ్లినా రూ.300 కనీసం తేడా కనిపిస్తోంది. రానున్న నెలలో మరో రూ.9 వేల కోట్ల భారం వేస్తున్నారు. ఊళ్లలో రోడ్డెక్కితే చాలు డబ్బు కట్టాల్సిందేనట.

పోరు బాట దిశగా అడుగులు

అందుకే మనందరం పోరుబాట పట్టాల్సిందే. ఈ నెల 13న అన్నదాతలకు అండగా సమస్యలపై కార్యక్రమం పెట్టాం. ఈనెల 27న కరెంటు చార్జీల మీద మరో కార్యక్రమం చేస్తున్నాం. జనవరి 3వ తేదీన ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం మరో కార్యక్రమం చేస్తున్నాం. అలాగే పార్టీని మనం మరింత బలోపేతం చేయాలి. దీన్ని వ్యవస్థీకృత విధానం (ఆర్గనైజ్డ్ స్ట్రక్చర్)లోకి తీసుకురావాలి. ఇందులో భాగంగా పార్టీలో క్రియాశీల మార్పులు తీసుకు వచ్చాం. సంక్రాంతి తర్వాత ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో బుధ, గురువారాల్లో ఉంటాను. అవసరాన్ని బట్టి శుక్రవారం కూడా ఉండేలా ప్లాన్ చేస్తున్నాను. 'కార్యకర్తలతో జగనన్న.. పార్టీ బలోపేతానికి దిశా నిర్దేశం'పేరుతో ఈ కార్యక్రమంలో పాల్గొంటాను. నా కార్యక్రమం ప్రారంభమయ్యేలోపు జిల్లా కమిటీలు, నియోజకవర్గ కమిటీలు, మండల స్థాయి కమిటీలు పూర్తి చేయాలి. సంక్రాంతి లోపే అవన్నీ పూర్తి కావాలి. నా కార్యక్రమం మొదలైన తర్వాత మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కమిటీలు పూర్తి చేద్దాం.

'ఫ్రెండ్లీ మహిళ'కు జాతీయ పురస్కారం

- దేశంలోనే ఉత్తమ పంచాయతీగా చిల్లపల్లి
- రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష



రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ స్థాయి అవార్డు అందుకుంటున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని: పెద్దపల్లి జిల్లా మంథని మండలం చిల్లపల్లి గ్రామానికి చెందిన మహిళా సంఘం సభ్యుల పనితీరుకు జాతీయస్థాయి పురస్కారం లభించింది. ఫ్రెండ్లీ ఉమెన్ విభాగంలో జాతీయ స్థాయిలో చిల్లపల్లి ఉత్తమ పంచాయతీగా ఎంపికవడంతో కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. కలెక్టర్‌తోపాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. 2022–23 సంవత్సరంలో మహిళా ఫ్రెండ్లీ పంచాయతీల్లో చిల్లపల్లి గ్రామం దేశంలోనే గుర్తింపు పొందింది.

పనితీరుకు పట్టం..

చిల్లపల్లి గ్రామంలోని ఆరేళ్ల వయసుగల పిల్లలందరినీ ఐసీడీఎస్‌లో నమోదు చేయడం, గ్రామసభల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం, స్వశక్తి మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేయించడం, మాతాశిశు మరణాల శాతం తగ్గడం, బాలికల విద్యకు ప్రోత్సాహం అందించడం తదితర కార్యక్రమాలు అమలు చేయడంలో చిల్లపల్లి గ్రామ మహిళలు అగ్రస్థానంలో నిలిచారు. దీంతో మహిళా ఫ్రెండ్లీ గ్రామంగా ఎంపికైన చిల్లపల్లికి రూ.65 లక్షల నగదు బహుమతి లభించింది. కాగా, ఈ నిధులను గ్రామాభివృద్ధికే వెచ్చిస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తితో మహిళల అభ్యున్నతి కోసం పనులు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు.

భారత్ గౌరవ్ అయోధ్య- కాశీ

యాత్ర రైలు ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: భారత్‌గౌరవ్ 'అయోధ్య – కాశీ పుణ్య క్షేత్ర యాత్ర' 26వ టూరిస్ట్ రైలు బుధవారం సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ప్రారంభమైంది. యాత్రకు బయలుదేరిన ప్రయాణికుల్లోని డాక్టర్ టి. విఠల్‌రెడ్డి, టి.కుసుమలు ఈ రైలును ప్రారంభించారు. ఐఆర్‌సీటీసీ జనరల్ మేనేజర్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అయోధ్య – కాశీ పుణ్యక్షేత్ర యాత్రలో భాగంగా యాత్రికులు గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగ్ రాజ్‌లలోని దివ్య క్షేత్రాలను సందర్శించనున్నారు. ఈ నెల 20 వరకు ఈ పర్యటన కొనసాగనుంది. భారత్ గౌరవ్ టూరిస్ట్ రైళ్లకు ప్రయాణికుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ హర్షం వ్యక్తం చేశారు.

త్వరలో మహా కుంభ పుణ్యక్షేత్ర యాత్ర..

ఐఆర్‌సీటీసీ మహాకుంభ పుణ్యక్షేత్ర యాత్ర పేరిట త్వరలో మరో భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును అందుబాటులోకి తేనుంది. పూర్తి వివరాలకు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ http://www.irctctourism. comను సందర్శించవచ్చు, లేదా 040- 27702407, 9701360701లను సంప్రదించవచ్చు.

మరమ్మతులకు నోచుకునేనా?

- గాంధారి-దుర్గం రహదారిలో కొంత భాగం కొట్టుకుపోయిన గుజ్జుల్ వాగు లోలెవల్ వంతెన
- కలెక్టర్ పరిశీలించి మరమ్మతులు చేయాలని అధికారులకు ఆదేశం
- అయినా ఇప్పటి వరకు పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న పలు గ్రామాలు, తండాల ప్రజలు


కొంత భాగం కొట్టుకుపోయిన గుజ్జుల్ వాగు వంతెన


గత జూలై మాసంలో వంతెనను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గాంధారి–దుర్గం రహదారిలో గుజ్జుల్ వాగు వద్ద లోలెవల్ వంతెన ధ్వంసమై కొంత భాగం కొట్టుకుపోయి రాకపోకలకు ఇబ్బందవుతుంది. వర్షాకాలంలో ఈ వాగు ఉధృతంగా వంతెనపై నుంచి ప్రవహిస్తుంది. వరద ఉధృతి ఉన్న సమయంలో వాగులో నుంచి దాటే ప్రయత్నంలో కొందరు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో ఓ యువకుడు వాగు దాటే ప్రయత్నంలో గల్లంతై మృతి చెందాడు. అప్పటి నుంచి ఈ వాగుపై హైలెవెల్ వంతెన నిర్మించాలని లొంకతండా, దుర్గం, కొత్తాబాది తండా, జెమిని తండా, డప్పు తండా, బీర్మల్ తండాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అయినా నాయకులు, అధికారులు పట్టించుకోవడంలేదు. గతంలో వరదల కారణంగా కొట్టుకుపోయిన వంతెనను కామారెడ్డి కలెక్టర్ పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశిస్తూ రూ.50 వేలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కాని అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేయలేదు. పలు తండాలు, గ్రామాలు సదాశివనగర్ మండలం ఉత్తునూర్ సహకార సంఘం పరిధిలో ఉన్నాయి. వర్షాకాలంలో రైతులకు రసాయన ఎరువుల బస్తాలు ఉత్తునూర్ నుంచి రావాల్సి ఉంది. అయితే వాగు వరకు ఎరువుల బస్తాలతో వచ్చిన లారీలు వాగు దాటే పరిస్థితి లేక వెనుదిరిగాయి. దీంతో రైతులు తమకు కావాల్సిన రసాయన ఎరువుల బస్తాలను ఉత్తునూర్ నుంచి ఆటోల్లో బస్తాకు రూ.30 చెల్లించి తెచ్చుకున్నారు. రైతులపై రవాణా ఖర్చుల భారం పడింది. ఇప్పటికైనా నాయకులు, అధికారులు వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుని వర్షాకాలం ప్రారంభానికి ముందే పనులు పూర్తయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాకాలంలో ఇబ్బంది పడ్డారు



వంతెన కొట్టుకుపోవడంతో రైతులు చాలా ఇబ్బంది పడ్డారు. మాకు బస్సు సౌకర్యం లేదు, వంతెన, రోడ్డు బాగా లేక ఆటోలు రాలేదు. ఎరువుల బస్తాలు, కావాల్సిన సరుకులు తెచ్చుకోడానికి ఇబ్బంది అయింది. వంతెనకు త్వరగా మరమ్మతులు చేయాలి. – శివాజీ, మాజీ సర్పంచ్, దుర్గం

ప్రతి ఏటా ఇదే పరిస్థితి



ఈ ఒక్క సారి కాదు ప్రతి ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఉంటుంది. ప్రతి వస్తువు కోసం గాంధారికి పోవాలే. వరదలు బాగా వచ్చినప్పుడు వంతెనపై నుంచి వాగు ప్రవహిస్తుంది. మాకు ఎక్కడికి పోరాదు. కలెక్టర్ సారు వచ్చి మా పరిస్థితి చూసిండ్రు. కొత్త వంతెన నిర్మాణానికి సారు డబ్బులు మంజూరు చేయాలని కోరుతున్నాం. – మేగావత్ కేమ్యా, లొంక తండా

నీళ్లు తగ్గే వరకు మరమ్మతులు చేయలేం

కొట్టుకుపోయిన వంతెనను గత జూలైలో కలెక్టర్ పరిశీలించారు. మరమ్మతుల కోసం రూ.50 వేలు మంజూరు చేశారు. కాని వాగులో నీరు ప్రవహిస్తుండటంతో పనులు చేయలేదు. నీరు తగ్గగానే పనులు చేయిస్తాం. – ఎంపీడీవో, రాజేశ్వర్

బ్యాక్ వాటర్ తగ్గాకే పనులు..

వంతెనను కలెక్టర్ పరిశీలించి మరమ్మతుల కోసం డబ్బులు మంజూరు చేశారు. వాగు ప్రవహిస్తుండడంతో పాటు గుజ్జుల్ డ్యాం బ్యాక్ వాటర్ కారణంగా పనులు చేయలేదు. బ్యాక్ వాటర్ తగ్గిన వెంటనే మరమ్మతులు చేస్తాము. నూతన వంతెన నిర్మాణం కోసం అంచనాలు వేసి పంపించాం. – వెంకటరాములు, పీఆర్ ఏఈ

ఎస్పీడీతో సమగ్ర శిక్ష ఉద్యోగుల చర్చలు విఫలం


హైదరాబాద్‌లో మంగళవారం రాత్రి సమగ్ర శిక్ష ఉద్యోగులతో చర్చలు జరుపుతున్న స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్

- రెండు రోజుల్లో కేజీబీవీ, భవిత కేంద్రాలకు తాళాలు!
- సమ్మెలో పాల్గొంటున్న ఉద్యోగుల వివరాలను సేకరిస్తున్న అధికారులు
- మరింత ఉధృతం చేస్తామంటున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

ఆర్మూర్: సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో సమ్మె బాట పట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘాల నాయకులతో రాష్ట్ర స్థాయి అధికారులు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయడానికి ఉద్యోగులు సిద్ధమవుతున్నారు. సమ్మెలో భాగంగా ఇది వరకే డీఈవో, ఎంఈవో కార్యాలయాలతోపాటు కేజీబీవీలు, భవిత కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు తమ విధులను బహిష్కరించి ఐదు రోజులుగా సమ్మెలో ఉన్నారు. తాజాగా స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఎస్పీడీ) ఈవీ నర్సింహారెడ్డి, అడిషనల్ డైరెక్టర్ లింగయ్య, ఏఎస్పీడీ రాధారెడ్డి, జేడీ రాజీవ్‌తో మంగళవారం రాత్రి జరిపిన చర్చలు విఫలం కావడంతో పూర్తి స్థాయిలో ఉద్యోగులు సమ్మె బాట పట్టేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అందులో భాగంగా మరో రెండు రోజుల వరకు తమకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన రాతపూర్వక హామీ రాని పక్షంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల(కేజీబీవీ)కు, భవిత కేంద్రాలకు పూర్తిస్థాయిలో తాళాలు వేసి బోధన, బోధనేతర సిబ్బంది తమ విధులను బహిష్కరించడానికి ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగి జిల్లాలోని 27 కేజీబీవీలు మూత పడితే ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న సుమారు 6,920 మంది బాలికల చదువు అగమ్యగోచరంగా మారనుంది. అదేవిధంగా జిల్లాలోని 27 భవిత కేంద్రాల్లో సేవలు పొందుతున్న సుమారు 300 మంది దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొన్నాయి.

వివరాలు సేకరిస్తున్న అధికారులు

సమ్మెబాట పట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగుల వివరాలను జిల్లా, మండల స్థాయి అధికారులు ఫోన్లు చేసి తెలుసుకుంటున్నారు. రాష్ట్ర స్థాయి అధికారుల మౌఖిక ఆదేశాల మేరకు సమ్మెలో పాల్గొంటున్న ఉద్యోగుల వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు సమర్పిస్తున్నారు. సమ్మెను విరమించి విధుల్లో చేరని పక్షంలో కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరికలు సైతం చేస్తున్నారు. మరో వైపు ఉద్యోగులు తమ ఉద్యోగాలను పణంగా పెట్టి నిరసన దీక్షలకు తీవ్రతరం చేస్తున్నారు.

రాతపూర్వక హామీ కోసం పట్టు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులతో సమావేశమై చాయ్ తాగినంత సేపట్లో వారి సమస్యలన్నింటినీ పరిష్కరించి జీవో కాపీలు ఇచ్చి సాగనంపుతానన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏడాదిగా ముఖం చాటేస్తున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు రాతపూర్వక హామీ వస్తే గాని తిరిగి విధుల్లోకి వెళ్లబోమంటూ సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె బాట పట్టిన విషయం విదితమే.

జొన్న రైతుల్లో ఆందోళన


పూత దశలో ఉన్న జొన్న పంట

బాల్కొండ: వ్యయప్రాయాసాలు ఓర్చి సాగు చేస్తున్న జొన్న పంటను ఆకాశం మబ్బులు వెంటాడుతుండటంతో జొన్న పంట చేతికందకుండ పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత రెండు రోజుల నుంచి ఆకాశంలో మబ్బులు, చిరు జల్లులు కురువడంతో పంటకు తెగుళ్ల వ్యాపించే ప్రమాదం ఎక్కువగా ఉందని వాపోతున్నారు. ప్రస్తుతం జొన్న పంట అధిక శాతం పూత వచ్చే దశలో ఉంది. ఈ దశలో వాతావరణం మబ్బులు కమ్మడం వల్ల జొన్నకు ఎర్ర పూత వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీంతో జొన్న పంట విత్తు పోసుకోకుండ తెల్లబోతుంది. జొన్న పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పూత వచ్చి కాడకు విత్తు వచ్చే అవకాశం లేదని రైతులు అంటున్నారు. ఆర్మూర్ డివిజన్‌లో వేల ఎకరాల్లో జొన్న పంటను సాగు చేస్తున్నారు. ఇది వరకే జొన్న పంటను మొగి పురుగు, కత్తెర పురుగు పట్టుకు తినడంతో రైతులు 3 జీ గుళికలు వేసి పంటను కాపాడుకున్నారు. ఆ గుళికలు వేసేందుకు అధికంగానే ఖర్చయిందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుత ఏడాది జొన్న పంటల ఎదుగుదల ఎంతో బాగా వచ్చింది. దీంతో రైతులు దిగుబడిపై భారీగా ఆశలు పెట్టుకున్నారు. కానీ రైతుల ఆశలను ప్రకృతి ఆవిరి చేస్తోంది. దీంతో జొన్న రైతులు దిక్కు తోచని స్థితిలో పడ్డారు. ప్రస్తుత ఏడాది సాగు చేసిన అధిక పంటలపై కత్తెర పురుగు ప్రభావం తీవ్రంగా చూపింది. దీంతో దిగుబడి తగ్గింది. ప్రస్తుతం జొన్న పంట పరిస్థితి కూడ అదే మాదిరిగా మారే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. సాధారణంగా పంట దిగుబడి ఎకరానికి 18 నుంచి 20 క్వింటాళ్లు వస్తుంది. కానీ ఇలా ఆకాశం మబ్బులు కమ్మడం వల్ల సగం కంటే తక్కువ దిగుబడి వచ్చే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. జొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ఎర్ర పూత వస్తోంది



జొన్న పంటకు ప్రస్తుత వాతావరణంతో ఎర్ర పూత అధికంగా వచ్చే అవకాశం ఉంది. ఎర్ర పూత వచ్చిన కాడ విత్తు పోసుకోవడం కష్టం. దీంతో దిగుబడి సగం తగ్గుతుంది. ఆకాశం మబ్బులు కమ్మడంతోనే సమస్య నెలకొంది. – గంగయ్య, రైతు, వెంచిర్యాల్

దిగుబడి తగ్గుతోంది



వాతావరణం మబ్బులు కమ్మేయడంతో జొన్న కాడకు ఎక్కువ ఎర్ర పూత వస్తోంది. దీంతో జొన్న దిగుబడి సగానికి తగ్గే ప్రమాదం ఉంది. ప్రభుత్వం ఎర్ర జొన్న రైతులను ఆదుకోవాలి. సాగు చేసినప్పటి నుంచి ఎర్ర జొన్నతో సమస్యలే వస్తున్నాయి. – ముత్యంరెడ్డి, రైతు, నాగంపేట్

ప్రారంభం ఎన్నడో?


పెద్దకొడప్‌గల్ ఎస్సీ కాలనీలో నిరుపయోగంగా ఉన్న భవనం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన భవనంలో పల్లె దవఖాన ఎప్పుడ ప్రారంభమవుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వం రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన దవాఖానా పనులు పూర్తయి సంవత్సరం గడుస్తున్నా ఇప్పటికీ అతీ గతీ లేదని వాపోతున్నారు. ప్రస్తుతం అన్ని వసతులు ఉన్నా నిరుపయోగంగా ఉంటుందని ప్రజల అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దవాఖానాను వెంటనే ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.